ప్రజల చేతిలో
www.ayudamdaily.com
# ఆయుధం
The Common People's Voice
మంగళవారం | మే 12, 2026 | సంపుటి : 6 | సంచిక : 342 | పేజీలు : 2

### మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా
## గద్వాల విజయలక్ష్మి



**హైదరాబాద్, ఆయుధం:** తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా గద్వాల విజయలక్ష్మి నియమితులయ్యారు. కమిషన్ ఛైర్‌పర్సన్, ఆరుగురు సభ్యులను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో సభ్యులుగా శ్రీకాంతాచారి తల్లి కాసోజు శంకరమ్మ, చాకలి ఐలమ్మ మనవరాలు చిట్యాల శ్వేత ఉన్నారు. వీరితో పాటు శశికళ యాదవరెడ్డి, సదాలక్ష్మి, రాధాబాయి, ఉజ్మా షకీరా సభ్యులుగా ఉన్నారు. ఈ కమిషన్ ఐదేళ్ల పాటు కొనసాగనుంది.

## బండి భగీరథ్‌పై విచారణ మొదలుపెట్టండి

- **డీజీపీకి సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం**



**హైదరాబాద్, ఆయుధం :** కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు సాయి భగీరథ్‌పై సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో పోక్సో కేసు నమోదైన విషయం తెలిసిందే. బండి భగీరథ్‌పై నమోదైన కేసులో వెంటనే విచారణ మొదలుపెట్టాలని డీజీపీ సీవీ ఆనంద్‌ను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఈ నెల 8నే ఫిర్యాదు వస్తే ఇప్పటివరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని డీజీపీని సీఎం ప్రశ్నించారు. కేసు వివరాలను రేవంత్‌రెడ్డికి డీజీపీ వివరించారు. ప్రధాని మోదీ పర్యటన ఏర్పాట్లలో సిబ్బంది బిజీగా ఉన్నారని తెలిపారు. కేసు సమగ్ర విచారణ కోసం ప్రత్యేక టీంలను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి డీజీపీని ఆదేశించారు.

**కూకట్‌పల్లి డీసీపీకి ఆదేశం :**

బండి భగీరథ్ కేసు దర్యాప్తును పర్యవేక్షించాలని కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్‌ను డీజీపీ ఆదేశించారు. కేసు పర్యవేక్షణ బాధ్యతలు డీసీపీ అప్పగించారు. పోక్సో కేసు కావడంతో దర్యాప్తును మహిళా అధికారికి అప్పగించారు.

**విచారణ కోసం ప్రత్యేక బెంచ్**

మరోవైపు బండి భగీరథ పోక్సో కేసుపై రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ స్పందించింది. సీపీ నుంచి కమిషన్ ఛైర్‌పర్సన్ కొత్తకోట సీతాదయాకర్ రెడ్డి వివరాలు తెప్పించుకున్నారు. పోక్సో కేసు విచారణ కోసం ప్రత్యేక బెంచ్ ఏర్పాటు చేశారు.

### బీజేపీకి సంబంధంలేదు :



బండి భగీరథ్ కేసులో చట్టం తన పని తాను చేసుకుపోతుందన్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు ఈ కేసుతో బీజేపీకి సంబంధం లేదని స్పష్టం చేశారు. బండి సంజయ్ కుటుంబీకుల జోక్యం ఉంటే విచారణ చేయించాలని కోరారు. బండి సంజయ్ కుటుంబంలో జరిగిన అంశం బీజేపీకి సంబంధం లేదన్నారు. బండి సంజయ్ తమ నాయకుడని, కేంద్రమంత్రిని పేర్కొన్నారు. బండి సంజయ్‌కు కేసుతో సంబంధం లేదన్న ఆయన, కేసుతో సంజయ్‌కు సంబంధం ఉంటే ఆయనపై చట్టపరమైన చర్యలు ఉంటాయని వెల్లడించారు.



### కలలు కనండి..
### అవి నిజమయ్యేలా
## అహర్నిశలు కష్టపడండి



- "సోషల్ మీడియాకు దూరంగా ఉంటేనే ఫోకస్ పెరుగుతుంది"
- "ప్రభుత్వ పాఠశాలల్లో 100% ఉత్తీర్ణత కోసం ఉపాధ్యాయులు కృషి చేయాలి"
- "చదువు వ్యక్తిగత అభివృద్ధికే కాదు.. సమాజ సేవకు దోహదం చేయాలి"
- "శ్రీయాంశ్ భవిష్యత్తులో వరంగల్‌కు మరింత పేరు తీసుకురావాలి"
- రాష్ట్ర మంత్రి కొండా సురేఖ, వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య

**వరంగల్, ఆయుధం:** విద్యార్థుల విజయాలు తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల కష్టానికి ప్రతిఫలమని రాష్ట్ర మంత్రి, కొండా సురేఖ వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య అన్నారు. "ఈ రోజు విద్యార్థులు సాధించిన మార్కులు చూసి తల్లిదండ్రులు ఎంతో గర్వపడుతున్నారు. మీ కోసం వారు కన్న కలలను మీరు నెరవేర్చాలి. కలలు కనండి.. ఆ కలలు నిజమయ్యేలా అహర్నిశలు కష్టపడాలి" అని ఎంపీ సూచించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా విద్యాశాఖ ఆధ్వర్యంలో పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తో కలిసి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య పాల్గొన్నారు. పదో తరగతిలో 550కు పైగా మార్కులు, ఇంటర్‌లో 980కు పైగా మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించిన ఎంపీ డా. కడియం కావ్య వారికి సర్టిఫికెట్లు అందజేశారు. అలాగే అతి చిన్న వయసులోనే Emerging Chess Championshipలో రెండు ప్రపంచ రికార్డులు సృష్టించిన కొండా శ్రీయాంశ్ మురళీకృష్ణ పటేల్‌ను ప్రత్యేకంగా అభినందించి ఆశీస్సులు అందజేశారు.
ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ.. కడియం ఫౌండేషన్ ద్వారా 2016 నుంచే ప్రభుత్వ పాఠశాలల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రోత్సహిస్తూ అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంచడమే లక్ష్యంగా మోటివేషన్ కార్యక్రమాలు చేపట్టామని పేర్కొన్నారు. "ఔటర్ మోటివేషన్, ఇన్నర్ మోటివేషన్ అని రెండు రకాలుగా ఉంటాయి. కానీ జీవితంలో ముందుకు వెళ్లాలంటే మనకోసం మనమే భవిష్యత్తు కోసం లక్ష్యాన్ని ఏర్పరచుకోవాలి. మిగతా 2లో..

### తెలంగాణ తెలుగు అకాడమీ ఛైర్మన్
## ప్రొఫెసర్ కూరపాటికి సన్మానం



**హనుమకొండ, ఆయుధం:** రాష్ట్ర తెలుగు అకాడమీ ఛైర్మన్ గా నియామకమైన సందర్భంగా ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణను గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వేముల నాగరాజు ఘనంగా సన్మానించారు. శాలువాతో సత్కరించి మెమెంటో అందించి గౌరవించారు. తెలంగాణ ఉద్యమంలో కూరపాటి పాత్ర అనిర్వచనీయమైనదని కొనియాడారు. ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ నియామకానికి సహకరించిన ముఖ్యమంత్రి వర్యులు రేవంత్ రెడ్డి కి, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి, ఎంపీ కడియం కావ్య, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కొండా సురేఖ, సీతక్క, ఎంఎల్ఏలు నాయిని రాజేందర్ రెడ్డి, కడియం శ్రీహరి, కేఆర్ నాగరాజు, రేవూరి ప్రకాశ్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తదితరులకు వేముల నాగరాజు ధన్యవాదాలు తెలిపారు. ప్రొఫెసర్ వెంకటనారాయణ నియామకంతో ఉద్యమకారులకు ఒక భరోసా లభించిందని అన్నారు.



## పేదలకు పట్టాలిచ్చి... ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలి

- **రాష్ట్ర మంత్రి పొంగులేటికి సిపిఐ వినతిపత్రం**

**వరంగల్, ఆయుధం:** వరంగల్ నగరంలో ప్రభుత్వ స్థలాలలో పేదలు వేసుకున్న ఇండ్లకు ఇంటి పట్టాలిచ్చి ఇందిరమ్మ ఇండ్లు కట్టించాలని సిపిఐ ప్రతినిధి బృందం మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డిని కలిసి వినతి పత్రం అందించింది. సిపిఐ జాతీయ నాయకులు, మాజీ ఎమ్మెల్యే చాడా వెంకటరెడ్డి నాయకత్వంలో సోమవారం హైదరాబాదులోని తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసి సిపిఐ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఇండ్ల స్థలాల కోసం, పక్కా ఇండ్ల నిర్మాణం కోసం ఏండ్ల తరబడి పేదలు పోరాడుతూనే ఉన్నారని మంత్రికి తెలియ చేశారు. స్వాతంత్రం వచ్చి దశాబ్దాలు గడుస్తున్నా పేదలు, బడుగు బలహీన వర్గాలు నివసించేందుకు స్థలం లేక, పక్కా ఇల్లు లేక, దుర్భర జీవితం గడుపుతున్నారని అన్నారు. అయినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేని పరిస్థితి దాపురించిందని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలకు ఇళ్లస్థలంతో పాటు పక్కా ఇల్లు నిర్మిస్తామని హామీ ఇవ్వడం జరిగిందని, అధికారంలోకి వచ్చి రెండున్నర ఏళ్ళు అవుతున్నా ఇంకా రాష్ట్ర ప్రభుత్వం దీనిని అమలు చేయడంలో నిర్లక్ష్యం చేస్తున్నదని అన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసి పేద ప్రజలను ఆదుకోవాలని కోరారు. పేదలకు, ప్రభుత్వ భూములలో గుడిసెలు, ఇండ్లు వేసుకుని నివసిస్తున్న వారికి ఇంటి పట్టాలిచ్చి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ ప్రతినిధి బృందంలో సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి ఎస్.కె బాసుమియా,సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పంజాల రమేష్,జిల్లా నాయకులు ఎండి అక్బర్, ఓర్సు రాజు, తాళ్లపల్లి జాన్ పాల్,సాంబ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

**సానుకూలంగా స్పందించిన మంత్రి**

వరంగల్ నగరంలో దశాబ్దాలుగా ప్రభుత్వ స్థలాలు ఇల్లు వేసుకుని నివసిస్తున్న నిరుపేదలకు న్యాయం చేస్తామని, వెంటనే సర్వే నిర్వహించి అర్హులైన వారందరికీ పట్టాలు పక్క గృహాలు నిర్మించి ఇస్తామని సిపిఐ ప్రతినిధి బృందానికి వారు హామీ ఇచ్చారు



### కొనసాగుతున్న అల్పపీడనం..
## వారం రోజుల్లో ఏపీలో వర్షాలు


**విశాఖ, ఆయుధం:** నైరుతి బంగాళాఖాతాన్ని ఆనుకొని శ్రీలంక పరిసర ప్రాంతాల్లో అల్పపీడనం కొనసాగుతోంది. రాగల 48 గంటల్లో ఈ అల్పపీడనం మరింత బలపడే అవకాశాలున్నాయని విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం అధికారి జగన్నాథ్ కుమార్ తెలిపారు. అల్పపీడనానికి అనుబంధంగా 5.8 కి.మీ ఎత్తులో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని చెప్పారు. ఫలితంగా వారం రోజుల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయన్నారు. సోమవారం కోస్తా జిల్లాల్లో గంటకు 40 నుంచి 50 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీస్తున్నాయని తెలిపారు. గడిచిన 24 గంటల్లో అల్లూరి జిల్లా పాడేరులో అత్యధికంగా 3.24 సెం.మీ వర్షపాతం నమోదైందని పేర్కొన్నారు.

### ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియను
## వేగవంతం చేయాలి

- **నిజమైన ఓటరు ఓటు హక్కు కోల్పోకుండా చర్యలు తీసుకోవాలి**
- **రాజకీయ పార్టీలతో సమీక్ష సమావేశాలు నిర్వహించాలి**
- **తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి**



**ములుగు, ఆయుధం:** ప్రత్యేక సమగ్ర సవరణ ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా తాజా ఓటరు జాబితాను ఎస్ఐఆర్ జాబితాతో మ్యాపింగ్ చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం తెలంగాణ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ సుదర్శన్ రెడ్డి హైదరాబాద్ నుంచి ఓటరు జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ సమావేశానికి ములుగు జిల్లా నుంచి జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో రాబోయే 15 రోజుల్లో కనీసం 90 శాతం మ్యాపింగ్ పూర్తి చేయాలని సూచించారు. స్టేషన్ ఘన్‌పూర్, అశ్వారావుపేట వంటి నియోజకవర్గాలు ఇప్పటికే 80 శాతానికి పైగా మ్యాపింగ్ పూర్తి చేశాయని తెలిపారు. ఒడిశా రాష్ట్రం ఇప్పటికే 90 శాతం, కర్ణాటక 81 శాతం, మహారాష్ట్ర 68 శాతం మ్యాపింగ్ పూర్తి చేశాయని, తెలంగాణ ఇంకా వెనుకబడి ఉందని పేర్కొన్నారు.
జిల్లా ఎన్నికల అధికారులు తమ బృందాలను ప్రోత్సహించి మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. మ్యాపింగ్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధుల మిగతా 2లో..




## కాంగ్రెస్ నేతలను కలిసిన మల్లం కుమార్



**హనుమకొండ, ఆయుధం:** హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులుగా నియమితులైన మల్లం కుమార్ సోమవారం తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తమపై నమ్మకంతో పార్టీ బాధ్యతలు అప్పగించినందుకు నాయకత్వానికి మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా మల్లం కుమార్ మాట్లాడుతూ... పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తానని, కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కట్టుబడి పనిచేస్తానని తెలిపారు. అధిష్టానం ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతానని పేర్కొన్నారు.



## నగరాభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలి

2 లో

- జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి
- హార్టికల్చర్, పారిశుద్ధ్యం, రోడ్లు, డ్రైనేజీలు, రంగసముద్రం అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్

## 16న టీయూడబ్ల్యూజే (ఐజేయూ) హనుమకొండ జిల్లా మహాసభ

- విజయవంతం చేయాలని రాష్ట్ర, జిల్లా నాయకుల పిలుపు
- గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ ఆవరణలో నిర్వహణకు ఏర్పాట్లు



2 లో



# నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలి!

- కొత్త రూల్స్ తొలగించాలనీ రూల్స్ ప్రతుల దహనం!
- సిఐటియు జిల్లా కార్యదర్శి అరూరి కుమార్

**వరంగల్, ఆయుధం;** కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్మిక , శ్రామిక వర్గంపై తీవ్ర అన్యాయం చేసేందుకు '4 లేబర్ కోడ్స్ తీసుకొచ్చి వాటికి కొత్త రూల్స్ తీసుకురావడం మరింత తీవ్ర నష్టపరిచి కుట్రలు చేస్తున్నదని వెంటనే ఈ రూల్స్ ని వెనక్కి తీసుకోని రద్దు చేయాలని, సిఐటియు వరంగల్ జిల్లా కార్యదర్శి అరూరి కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం వరంగల్ జిల్లా కేంద్రం పోచమ్మ మైదాన్ సెంటర్లో లేబర్ కోడుల రూల్స్ పత్రాల దహనం చేశారు. సీఐటీయూ వరంగల్ జిల్లా అధ్యక్షులు మహమ్మద్ బషీద్ అహమ్మద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి అరూరి కుమార్ మాట్లాడుతూ... కేంద్ర బిజెపి మోడీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తుల పాదాల చెంత కార్మిక హక్కులను తాకట్టు పెట్టేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తుందని, అనేక ఏళ్ల నుండి ప్రాణత్యాగాలు చేసి సాధించుకున్న టువంటి 29 కార్మిక అనుకూల చట్టాలను రద్దు చేసి వాటి స్థానాల్లో నాలుగు లేబర్ కార్డులు తీసుకొచ్చారని దేశవ్యాప్తంగా కార్మికులు ఎంత ప్రత్యేకించి సమ్మెలు పోరాటాలు నిరసనలు తెలిపినా ఈ ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తూ కార్పొరేట్ శక్తుల ఖజానా నింపేందుకే కార్మికుల కష్టార్జితాన్ని కొల్లగొట్టేందుకు ఆ నాలుగు లేబర్ కోడు తీసుకొచ్చి వాటికి కొత్త రూల్స్ గెజిట్ విడుదల చేశారని మరింత అన్యాయానికి పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు లేబర్ కోడ్లతోపాటు కొత్త రూల్స్ ని తక్షణమే రద్దు అయ్యే వరకు యావత్ కార్మిక వర్గం అంతా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి జన్ను ప్రకాష్, జిల్లా కమిటీ సభ్యులు గున్నాల ప్రభాకర్, ఓరుగంటి జీవన్, తాటికాయల రత్నం, మంద ప్రభాకర్, పులి మాటి శివ, కొమ్ముదాసు జలగం కుమార్, సింగారపు రాజేష్, జూలూరు నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# 'హనుమాన్ దీవెనలు ప్రజలపై ఉండాలి'



**రఘునాథపల్లి, ఆయుధం:** రఘునాథపల్లి లోని శ్రీ మహాదేవ స్వామి ఆలయంలో ఆలయ పూజారి పిండిపోలు శ్రీనివాస్ శర్మ నేపథ్యంలో హనుమాన్ దీక్ష వేసుకున్న స్వాములకు ఇరుముడి కట్టారు. భక్తులు స్వాములు పరమశివునికి అభిషేకాలు.. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో భక్తులతో కిటకిటలాడింది. ఆలయ కమిటీ చైర్మన్ కూరెళ్ళ ఉపేందర్ గుప్తా రేణుక దంపతులు మాట్లాడుతూ... పవిత్రమైన హనుమాన్ జయంతిని పురస్కరించుకొని దీక్ష చేసిన భక్తులు స్వామివారి కృప ఎప్పటికీ ఉండాలని ఆయన కోరారు. హనుమాన్ భక్తులు జై హనుమాన్ జై జై హనుమాన్ అంటూ నినాదాలు చేశారు. అనంతరం వాసవి క్లబ్ వాసవి వనిత అధ్యక్షులు కోరెల్లి పెద్ద ఉపేందర్ గుప్తా కూరెల్లి రేణుక ఆధ్వర్యంలో మాలదారులకు శాలవతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ మాలదారులు మాజీ జెడ్పిటిసి సభ్యులు బొల్లం అజయ్ మణికంఠ, సీనియర్ జర్నలిస్టు కందుల అనిల్ కుమార్, నరసింహ చారి, కోళ్ల సాయికుమార్ గౌడ్, నితిన్, సంతోష్, మరాటి శ్రీశైలం కురుమ, కందుల మహీధర్ పటేల్, గణేష్ భక్తులు కొరెల్లి వేద కుమార్ గుప్తా దంపతులు, వినయ్ కుమార్ గుప్తా, లాగిశెట్టి లింగయ్య దంపతులు, గుర్రాల దిలీప్ కుమార్ పటేల్, యాదగిరి, హరీష్ గౌడ్ మహిళ భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# నగరాభివృద్ధి పనులను పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి
- హార్టికల్చర్, పారిశుద్ధ్యం, రోడ్లు, డ్రైనేజీలు, రంగసముద్రం అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్



**వరంగల్, ఆయుధం:** నగరాభివృద్ధి పనులలో మరింత వేగం పెంచి సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అధికారులను ఆదేశించారు. హనుమకొండ జిల్లా కలెక్టర్, జీడబ్ల్యూఎంసీ ఇన్‌చార్జ్ కమిషనర్ చాహత్ వాజ్‌పాయి సోమవారం నగరంలోని పలు అభివృద్ధి, పారిశుద్ధ్య, హార్టికల్చర్ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సంబంధిత అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. మొదటగా నాయుడు పెట్రోల్ బంక్ నుంచి మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ వరకు సెంట్రల్ మీడియన్‌లో నాటిన మొక్కలు, వాటి నిర్వహణను కలెక్టర్ పరిశీలించారు. వేసవి తీవ్రత దృష్ట్యా మొక్కలు ఎండిపోకుండా ఎప్పటికప్పుడు నీరు పోస్తూ, కలుపు మొక్కలను తొలగించి సమర్థవంతంగా సంరక్షించాలని అధికారులను ఆదేశించారు. నగర సుందరీకరణలో హార్టికల్చర్ విభాగం కీలక పాత్ర పోషించాలని సూచించారు. అనంతరం మట్టేవాడ, రామన్నపేట, లక్ష్మీపురం ప్రాంతాల్లో నిర్మించిన అంతర్గత రహదారులు, డ్రైనేజీ వ్యవస్థలను పరిశీలించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నాణ్యత ప్రమాణాలతో పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.

26వ డివిజన్‌లో కొనసాగుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించిన కలెక్టర్, పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడారు. వీల్ బ్యారోలను ఎప్పటికప్పుడు శుభ్రపరుచుకుంటూ సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. నగర పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఉర్సుగుట్ట వద్ద ఉన్న రంగసముద్రాన్ని పరిశీలించిన కలెక్టర్, పబ్లిక్ హెల్త్ శాఖ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ఫోర్‌షోర్ బండును తనిఖీ చేశారు. ఇరిగేషన్, పబ్లిక్ హెల్త్ శాఖల అధికారులు సంయుక్తంగా జాయింట్ ఇన్‌స్పెక్షన్ నిర్వహించాలని ఆదేశించారు. రంగసముద్రం డీసిల్టేషన్ కోసం తక్షణమే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇరిగేషన్ అధికారులను సూచించారు. ఈ కార్యక్రమంలో బల్దియా ఈఈ సంతోష్ బాబు, ఎంహెచ్‌ఓ డాక్టర్ రాజేష్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.




# ఉచిత చలివేంద్రం ప్రారంభం

**హనుమకొండ, ఆయుధం:** హనుమకొండ బస్టాండ్ వెనకాల గల కాకాజీ కాలనీలోని హాస్పిటల్స్ కు ఈ వేసవి కాలంలో వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న పేషెంట్లకు వారి దాహార్తి తీర్చడానికి అభయ హాస్పిటల్ వారి సౌజన్యంతో థౌజెండ్ పిల్లర్స్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో "ఉచిత చలివేంద్రాన్ని" సోమవారం ఏర్పాటు చేశారు. చలివేంద్రాన్ని ప్రారంభించిన ఎలక్టడ్ గవర్నర్ లయన్ నరహరి సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ఈ ప్రాంతంలో గ్రామీణ ప్రాంతాల నుంచి అనేకమంది పేషెంట్లు వస్తూ ఉంటారు వారి సౌకర్యార్థం ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం చాలా సంతోషించదగ్గ విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు పరికిపండ్ల వేణు, ప్రధాన కార్యదర్శి వైద్యం రాజగోపాల్, ఎలెక్టెడ్ జోనల్ చైర్ పర్సన్ డాక్టర్ గౌతమ్, డాక్టర్ భార్గవి, క్లబ్ సీనియర్ సభ్యులు Ln.పాము శ్రీనివాస్, Ln. చంద్రశేఖర్, గంజి నరహరి, మార్త పాపయ్య తదితరులు పాల్గొన్నారు

# 16న టీయూడబ్ల్యూజే (ఐజేయూ) హనుమకొండ జిల్లా మహాసభ

- విజయవంతం చేయాలని రాష్ట్ర, జిల్లా నాయకుల పిలుపు



**హనుమకొండ, ఆయుధం:** ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయూ) అనుబంధ తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే) హనుమకొండ జిల్లా మహాసభ ఈ నెల 16న ఉదయం 10:30 గంటలకు హనుమకొండలోని గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ ఆవరణలో నిర్వహించనున్నట్లు టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు గడ్డం రాజిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి తోట సుధాకర్ తెలిపారు. సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్ క్లబ్ లో టీయూడబ్ల్యూజే హనుమకొండ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ మహాసభకు వరంగల్ పార్లమెంటు సభ్యురాలు కడియం కావ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కుడా చైర్మన్, డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విరాహత్ అలీ, రామ్ నారాయణ తదితరులు హాజరు కానున్నట్లు వారు తెలిపారు. జర్నలిస్టుల పరిష్కారం కోసం టీయూడబ్ల్యూజే ముందు వరుసలో నిలిచిందని, ప్రస్తుతం కొనసాగుతున్న అక్రిడిటేషన్ ప్రక్రియలో అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ వచ్చే కృషి చేస్తున్నదని చెప్పారు. గత మహాసభ నుండి నేటివరకు జిల్లాలో టీయూడబ్ల్యూజే అనేక కార్యక్రమాలు నిర్వహించి జర్నలిస్టుల మన్ననలు పొందిందని, రానున్న జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి మరింతగా కృషి చేస్తామని అన్నారు. ఈ సందర్భంగా 16న జరిగే మహాసభకు అధిక సంఖ్యలో జర్నలిస్టులను తరలించాలని, ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా సీనియర్ జర్నలిస్టు, ఐజేయూ జాతీయ కౌన్సిల్ సభ్యులు పివి మదన్ మోహన్ ఎంపిక తదితర పలు తీర్మానాలు సమావేశంలో ఆమోదించారు. ఈ సమావేశంలో రాష్ట్ర హౌసింగ్, వెల్ఫేర్ కన్వీనర్ వల్లాల వెంకటరమణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కంకనాల సంతోష్, ప్రెస్ క్లబ్ మాజీ అధ్యక్షులు గడ్డం కేశవ మూర్తి, పిన్నా శివకుమార్, గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, కార్యదర్శి బొల్లారపు సదయ్య, కోశాధికారి బోళ్ల అమర్, జిల్లా యూనియన్ ఉపాధ్యక్షులు ఎంఎ. నయీం, డాక్టర్ పోడి శెట్టి విష్ణు వర్ధన్, ఉట్కూరి సాయిరాం, కోశాధికారి బచ్చు పురుషోత్తం, నాయకులు గన్ను సంతోష్, ముదిగిరి ఓదెలు, పులికంటి రాజేందర్, కె.ఆదిరెడ్డి, వాజీద్, దండు మోహన్, గడ్డం బాలరాజు, ఖాదర్ పాషా, అల్లె రామారావు, ఎర్రోల్ల జగన్, తాళ్ల రవి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

- హాస్టల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి



**హనుమకొండ, ఆయుధం:** విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న వసతి, ఆహార సదుపాయాలు నాణ్యతతో ఉండాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ఆదేశించారు. సోమవారం హనుమకొండ సుబేదారిలోని గిరిజన సంక్షేమ శాఖ పోస్ట్ మెట్రిక్ బాలుర కళాశాల వసతి గృహాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్‌లోని కిచెన్ షెడ్, ఆర్వో వాటర్ ప్లాంట్, టాయిలెట్లు, డార్మెటరీలను పరిశీలించి, నిర్వహణపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం స్టోర్‌రూమ్‌లో నిల్వ ఉంచిన కూరగాయలు, పప్పులు, బియ్యం తదితర ఆహార పదార్థాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించిన కలెక్టర్, స్టోర్‌లో ఉన్న నిల్వలు, రికార్డుల్లో నమోదైన వివరాల మధ్య వ్యత్యాసాలు ఉన్నట్లు గుర్తించారు. అలాగే పప్పు దినుసులు, ఇతర ఆహార పదార్థాల నిర్వహణ సరిగా లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో సంబంధిత వార్డెన్ హాల్ సింగ్‌కు నోటీసు జారీ చేయాలని డీటీడీవో ప్రేమకళను ఆదేశించారు.

హాస్టల్ విద్యార్థులతో కలెక్టర్ ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ఏ కళాశాలలో చదువుతున్నారు, భోజనం, స్నాక్స్ సమయానికి అందుతున్నాయా, ఆహార నాణ్యత ఎలా ఉందనే అంశాలపై ఆరా తీశారు. వారానికి ఎన్నిసార్లు చికెన్, మటన్, గుడ్లు అందిస్తున్నారో వార్డెన్‌ను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్ పరిసరాలను పరిశీలించిన కలెక్టర్, విద్యార్థులకు మెరుగైన వసతి, పరిశుభ్రమైన వాతావరణం, నాణ్యమైన ఆహారం అందించడంలో నిర్లక్ష్యం సహించబోమని పేర్కొన్నారు. విద్యార్థుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

# ప్రజావాణి అర్జీల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

- కలెక్టర్ చాహత్ బాజ్ పాయి
- ప్రజావాణికి 126 అర్జీలు



**హనుమకొండ, ఆయుధం:** ప్రజావాణి కార్యక్రమంలో పెండింగ్ అర్జీలను త్వరగా పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్.రవి, జిల్లా రెవెన్యూ అధికారి కె. శ్రీనివాస్, జిల్లా అధికారులతో కలిసి ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజావాణి కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ, వైద్య ఆరోగ్య, మున్సిపల్, ఎక్సైజ్, ఇతర శాఖలకు సంబంధించి ప్రజలు తమ తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ కు 126 అర్జీలను అందజేశారు. ప్రజలు తమ సమస్యలను పరిష్కరించాలని ప్రజలు అందించిన అర్జీలను కలెక్టర్ స్వీకరించి వాటి పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన అర్జీల పరిష్కారంపై ధర్మసాగర్, శాయంపేట, ఐనవోలు మండలాల తహసిల్దార్లతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి అర్జీల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ లో అందించే వివిధ రకాల సేవల గురించిన పోర్టల్ గురించిన వివరాలను చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ రాజారెడ్డి అధికారులకు వివరించారు. ఈ సందర్భంగా ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన అర్జీలను పాత పోర్టల్ లో నమోదు చేశారని, వాటిని సంబంధిత శాఖల అధికారులు వెంటనే పరిష్కార చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో వస్తున్న దరఖాస్తులను నూతన ప్రజావాణి పోర్టల్ లో నమోదవుతున్నాయని, వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా నూతన ప్రజావాణి పోర్టల్ సంబంధించిన వివిధ అంశాలను జిల్లా కలెక్టర్ సమక్షంలో అధికారులకు ఈడియం శ్రీధర్ వివరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో శేషాద్రి, డిఆర్ డిఓ మేన శ్రీను, వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసిల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

## కలలు కనండి.. అవి నిజమయ్యేలా
# అహర్నిశలు కష్టపడండి

(మొదటి పేజీ తరువాయి..)




మనపై మనకు నమ్మకం ఉన్నప్పుడే అనుకున్నది సాధించగలుగుతాం" అని చెప్పారు. విద్యార్థులు ఎప్పుడూ పాజిటివ్ థింకింగ్‌తో ఉండాలని, అనుకున్నది పట్టుదలతో సాధించాలని సూచించారు. ఇంటర్మీడియట్ పూర్తయ్యాక తొందరపాటు నిర్ణయాలు తీసుకోకుండా, సోషల్ మీడియాకు దూరంగా ఉంటూ, ఇంతకుముందు ఎలా కష్టపడి చదివారో అదే చిత్తశుద్ధితో జీవితంలో ముందడుగు వేయాలని సూచించారు. "జీవితంలో విజయాన్ని సాధించాలంటే క్రమశిక్షణ చాలా అవసరం. ప్రతి విద్యార్థి తన లక్ష్యాన్ని చేరుకునే వరకు కష్టపడాలి. చదువు అనేది వ్యక్తిగత అభివృద్ధికే కాదు.. సమాజానికి సేవ చేసే స్థాయికి తీసుకెళ్లాలి" అని ఎంపీ డాక్టర్ కడియం కావ్య పేర్కొన్నారు.. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చెప్పిన "పే బ్యాక్ టు సొసైటీ" భావనను ప్రతి విద్యార్థి అలవర్చుకోవాలని, సమాజానికి తమ వంతు సహకారం అందించాలని సూచించారు. వచ్చే అకాడమిక్ ఇయర్‌లో జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. ఆర్థిక పరిస్థితులు బాగాలేని విద్యార్థులను గుర్తించి, వారిని పాఠశాలల్లో చేర్పించి ఉత్తీర్ణత దిశగా తీర్చిదిద్దాలని అధికారులకు, ఉపాధ్యాయులకు ఎంపీ సూచించారు. అలాగే చెస్‌లో ప్రపంచ రికార్డులు సాధించిన శ్రీయాంశ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి వరంగల్ జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. "బాబుకు నా ఆశీస్సులు ఎప్పుడూ ఉంటాయి. ఇక్కడికి వచ్చిన ప్రతి విద్యార్థి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలి" అని అన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి డా. శ్రీధర్ కుమార్, డీఈవో బి.రంగయ్య నాయుడు, డీఎంహెచ్‌వో సాంబయ్య, డీవైఎస్‌వో బాలగంగాధర్, ఆర్డీవో సుమ, డీఆర్‌వో విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ మ్యాపింగ్ వేగవంతం చేయాలి

(మొదటి పేజీ తరువాయి..)

పాత్ర కేవలం ఇళ్ల గుర్తింపు, వ్యక్తుల గుర్తింపుకు మాత్రమే పరిమితం కావాలని స్పష్టం చేశారు. ప్రైవేట్ వ్యక్తులు ఎస్ఐఆర్ మ్యాపింగ్ నిర్వహిస్తున్నారనే భావన ప్రజల్లో కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ఎస్ఐఆర్ ప్రక్రియ కోసం అవసరమైన డేటా ఎంట్రీ ఆపరేటర్లను అన్ని వనరుల నుంచి గుర్తించి నియమించుకోవాలని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రారంభమైన తర్వాత ప్రతిరోజూ ఫారాల పంపిణీ, సేకరణపై సమీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. ప్రజలకు తమ ప్రాంతంలోని బీఎల్ఓ ఎవరో తెలిసేలా చర్యలు తీసుకోవాలని, నిజమైన ఓటరు తన ఓటు హక్కు కోల్పోకుండా చూడాలని ఆదేశించారు. మ్యాపింగ్ పురోగతిని పెంచేందుకు రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించాలని సూచించారు. స్వయం సహాయక సంఘాల మహిళల సహకారాన్ని కూడా వినియోగించుకోవాలని తెలిపారు.

అనంతరం జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవ రావు మాట్లాడుతూ జిల్లాలో ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. బీఎల్ఓల పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తూ లక్ష్యాలకు అనుగుణంగా మ్యాపింగ్ పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. అవసరమైన డేటా ఎంట్రీ ఆపరేటర్లను గుర్తించి నియమిస్తున్నామని, రాజకీయ పార్టీలతో సమన్వయం చేసుకుంటూ పారదర్శకంగా ప్రక్రియ నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, ప్రతి అర్హ ఓటరు పేరు సక్రమంగా మ్యాపింగ్ అయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వెంకటేష్, ఎలక్షన్ సూపరింటెండెంట్ ఎండి సలీం, డిప్యూటీ తహసిల్దార్ నితీష్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ మనోహర్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# దివ్యాంగులకు ట్రైసైకిళ్ల పంపిణీ

**వరంగల్, ఆయుధం:** రోటరీ క్లబ్ వరంగల్ సెంట్రల్ ఆధ్వర్యంలో శివనగర్‌లోని పల్లవి హాస్పిటల్‌లో దివ్యాంగులకు ట్రై సైకిళ్ల పంపిణీ చేశారు. రోటరీ క్లబ్ వరంగల్ సెంట్రల్ అధ్యక్షులు మదూరు గణేష్, కార్యదర్శి పొన్న హరినాథ్, కోశాధికారి బండారు కుమారస్వామి, సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం రోటరీ క్లబ్ 48వ సేవా కార్యక్రమాలలో భాగంగా జరిగింది. దాతలు పాలారపు కృష్ణమూర్తి, రావికంటి అశోక్, ఇరుకుల్ల నాగేశ్వరరావు సహకారంతో దివ్యాంగులు బానోతు రవి, శ్రీనివాస్, రాజులకు సుమారు ₹50,000 విలువైన ట్రై సైకిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఇటీవల వరంగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా ఎన్నికైన Rtn చకిలం ఉపేందర్, రామ్‌కీ విల్లా ఓనర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీగా ఎన్నికైన Rtn బేతి అశోక్ బాబు ను రోటరీ క్లబ్ సభ్యులు ఘనంగా సన్మానించారు. చకిలం ఉపేందర్ మాట్లాడుతూ, ప్రజలకు కష్టసుఖాలలో న్యాయపరంగా అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జూలూరి కృష్ణమూర్తి, చిన్నాల సత్యనారాయణ, పోరండ్ల రత్నాకర్, సదానందం, శ్రీరామ్, రవీందర్ ప్రసాద్, కిరణ్ కుమార్, మొగిలి చంద్రమౌళి, సురేష్ తదితర రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు. ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించిన రోటరీ క్లబ్ సభ్యులకు దివ్యాంగులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.



# జులై 1నుంచి వీబీ జీ రామ్ జీ

**ఢిల్లీ, ఆయుధం:** 'మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం' (ఎంజీనరేగా)ను రద్దు చేసి దాని స్థానంలో కేంద్ర ప్రభుత్వం 'వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్(గ్రామీణ్'ను తీసుకువచ్చిన విషయం తెలిసిందే. ఈ కొత్త చట్టాన్ని జులై 1నుంచి అమలు చేయనున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇది గ్రామీణ కుటుంబాలకు 125 రోజుల చట్టబద్ధమైన వేతన ఉపాధికి హామీ ఇస్తుందని తెలిపింది.

జీవనోపాధి భద్రత, గ్రామీణ ప్రజలకు ఆదాయ కల్పన, మౌలిక సదుపాయాల అభివృద్ధి, గ్రామీణ ప్రజల్లో పరివర్తనను తీసుకురావడమే ఈ చట్టం లక్ష్యమని గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ తెలిపింది. ఎంజీనరేగా నుంచి కొత్త విధానానికి మారే ప్రక్రియలో కార్మికులకు ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించింది. కొత్త గ్రామీణ రోజ్‌గార్ గ్యారంటీ కార్డులు జారీ అయ్యే వరకు ప్రస్తుతం ఉన్న ఇకేవైసీ ఎంజీనరేగా కార్డులే చెల్లుబాటులో ఉంటాయంది. జాబ్ కార్డులు లేని కార్మికులు గ్రామ పంచాయతీలో నమోదు చేసుకోవాలని సూచించింది. వేతన చెల్లింపులు, ఫిర్యాదుల పరిష్కారం, పని కేటాయింపు నిబంధనలు, పరిపాలనా వ్యయం వంటి ఇతర విషయాల గురించి రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలతో సంప్రదిస్తున్నట్లు గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ తెలిపింది. త్వరలో ప్రజాభిప్రాయ సేకరణ కోసం వాటిని ప్రచురిస్తామంది. వేతనాలను నేరుగా కార్మికుల బ్యాంకు ఖాతాలు లేదా పోస్ట్ ఆఫీస్ ఖాతాల్లోకి బదిలీ చేయనున్నట్లు పేర్కొంది.

Edited, Printed, Published and Owned by **V.P.CHANDER.** On Behalf of **VNR MEDIA**. Printed at Pragathi Graphics # 6-8-231, Sagara Veedhi, Hanumakonda.
Published at 2-2-414, Nayeem Nagar, Hanumakonda, TS-506001. RNI: TEL TEL 2019/78717, Email: ayudamdaily@gmail.com. Contact: 98480-15695